# సాక్షి జగిత్యాల

బుధవారం ׀ 27 ׀ సెప్టెంబర్ ׀ 2023






**జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు**

జగిత్యాలరూరల్: మండలంలోని మోరపల్లిలో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ప్రత్యేక పూజలు చేశారు.



**అండగా ఉంటాం**

న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. 8లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 31.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నేడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

జగిత్యాల: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని బుధవారం అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. కలెక్టరేట్ భవనంలో ఉదయం 11 గంటలకు జయంతి కార్యక్రమం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలని పేర్కొన్నారు.

### డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

జగిత్యాల: జగిత్యాలలోని నూకపల్లిలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్‌బాషా సందర్శించారు. అక్టోబర్ మొదటి వారంలో మంత్రి కేటీఆర్ పర్యటించనున్న నేపథ్యంలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లత, మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు ఉన్నారు.

### వీరవనిత చాకలి ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: తెలంగాణ సాయుధ పోరాటంలో ఉవ్వెత్తున ఎగిసి ఉద్యమానికి ఊపిరి పోసి తన ప్రాణాలను త్యాగం చేసిన ఉద్యమ స్ఫూర్తి నింపిన వీరవనిత చాకలి ఐలమ్మ అని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఐలమ్మ 128వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, సాయుధ పోరాటకాలంలో హక్కుల సాధన కోసం కొట్లాడిన గొప్ప ప్రజాస్వామిక వాది చిట్యాల ఐలమ్మ అన్నారు. సమరయోధులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని, వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏవో అమర్‌నాథ్, ఆర్ఐలు జానిమియా, వేణు, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### లింగ నిర్ధారణ చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కోరుట్లరూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని అయిలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా స్త్రీ, పురుషుల మధ్య వ్యత్యాసం ఒక వెయ్యి నిష్పత్తి తొమ్మిది వందల డెబ్బై నాలుగు ఉండగా కోరుట్ల మండలంలో పురుషుల సంఖ్యలో వ్యత్యాసం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. గ్రామాల్లోని గర్భిణులను ప్రతినెలా మానిటరింగ్ చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి షమియొద్దీన్, సూపర్‌వైజర్లు ధనుంజయ, రమణ,సిబ్బంది పాల్గొన్నారు.

### నిమజ్జన ప్రాంతాల్లో వైన్ షాపులు మూసివేయాలి

జగిత్యాలక్రైం: జిల్లాలో వినాయక నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో మద్యం దుకాణాలు, కల్లు డిపోలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాలు, జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల మున్సిపాలిటీల్లో ఈనెల 27 ఉదయం 6 నుంచి 28 తేదీ ఉదయం 6 గంటల వరకు, జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, మున్సిపాలిటీల్లో ఈనెల 28 ఉదయం 6 గంటల నుంచి 29న ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

---

- 'గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళకు ఇటీవల జ్వరం వచ్చింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రాగా.. పరీక్షలు చేశారు. ప్లేట్‌లెట్స్ తగ్గడంతో డెంగీ అని చెప్పి రూ.15వేల వరకు బిల్లు వేశారు. నిజానికి ఎలిసా టెస్ట్ ద్వారానే డెంగీ నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. కానీ.. ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రం ఎలిసా టెస్ట్ చేసే మిషన్ ఎక్కడా లేకున్నా.. డెంగీ అంటూ భయపెడుతున్నారు. ఎన్‌ఎస్‌-1 ర్యాపిడ్ కిట్ల ద్వారా చేసి ప్లేట్‌లెట్స్ తగ్గాయనడంతో ప్రజలు సైతం భయాందోళనకు గురవుతున్నారు..'



- 'వెల్గటూర్ మండలం కోటిలింగాలకు చెందిన శాంతి అనే మహిళకు జ్వరం వచ్చింది. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా ప్లేట్‌లెట్స్ తగ్గాయని దాదాపు రూ.30వేల వరకు బిల్లు వేశారు. ఈ మహిళకు బ్లడ్‌బ్యాంక్ నుంచి ప్లేట్‌లెట్స్ తెప్పించి మరీ ఎక్కించారు...'

ఇలాంటి సంఘటనలు జిల్లాలో నిత్యం జరుగుతున్నాయి.

# డెంగీ బూచి.. అందినంతా దోచి..



డెంగీ నిర్ధారణ పరీక్షలు

- పరీక్షలు, చికిత్స అంటూ వసూళ్లు
- ప్రైవేటు ఆస్పత్రులపై కొరవడిన పర్యవేక్షణ
- జ్వరం వస్తేనే భయపడుతున్న ప్రజలు
- ఎన్‌ఎస్‌-1 కిట్ల పేరిట టెస్ట్‌లు
- ఎలిసా టెస్ట్ ద్వారానే నిర్ధారణ

| జిల్లాలో నమోదైన (ఎలిసా టెస్ట్ ద్వారా) డెంగీ కేసులు ఇలా.. | |
|---|---|
| 2019 | 158 |
| 2020 | 05 |
| 2021 | 307 |
| 2022 | 98 |
| 2023 | 80 (ఇప్పటి వరకు) |

జగిత్యాల: వాతావరణంలో మార్పులతో అనేక మంది విషజ్వరాల బారిన పడుతున్నారు. ఇంటి కొకరు చొప్పున జ్వరపీడితులు ఉన్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు అందినంతా దోచుకుంటున్నాయి. జ్వరం అని వస్తే వెంటనే ఎన్‌ఎస్‌-1 కిట్ల ద్వారా టెస్ట్ చేయడం, ప్లేట్‌లెట్స్ తగ్గాయనడం.. చికిత్స అందించినట్లు అత్యధికంగా బిల్లులు వేయడం.. ఇదే తంతు జరుగుతోంది జిల్లాలో. అయినప్పటికీ వైద్యశాఖ అధికారులు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

**ఇష్టానుసారంగా టెస్ట్‌లు**

జ్వరం వచ్చిన ప్రతిఒక్కరినీ డెంగీ కింద పరిగణిస్తున్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఇష్టానుసారంగా టెస్ట్‌లు చేస్తూ అందినకాడికి దోస్తున్నారు. వర్షాభావ పరిస్థితులతో రకరకాల జ్వరాలు వస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి జ్వరాలు సాధారణం. అయితే ఎలాంటి జ్వరం వచ్చినా డెంగీ కిందనే నిర్ధారిస్తున్నారు. జిల్లాలో సుమారు 100 ఆస్పత్రులకు పైగా ఉన్నాయి. ఇందులో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఒక వ్యక్తి జ్వరం అని వెళ్తే వివిధ పరీక్షల పేరిట దాదాపు రూ.40 వేల వరకు బిల్లులు వేస్తున్నారు. సాధారణంగా మనిషికి నాలుగు లక్షల నుంచి రెండు లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. అవి కొన్నిసార్లు తగ్గినా డెంగీగా పరిగణించలేమని వైద్యులు పేర్కొంటున్నారు. 20 వేల వరకు తగ్గితేనే ప్రమాదకరంగా గుర్తించాల్సి ఉంటుందంటున్నారు. అయితే ప్రైవేటు ఆస్పత్రులు ఓ ల్యాబ్‌ను అనుసంధానం చేసుకుని ఇందులో ఎన్‌ఎస్‌-1 పరీక్షలు చేస్తూ డెంగీ వచ్చిందని, ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నాయని నిర్ధారిస్తున్నారు.

**ఎలిసా టెస్ట్‌తోనే నిర్ధారణ**

వాస్తవంగా డెంగీ జ్వరమైతే తప్పకుండా ఎలిసా టెస్ట్ ద్వారానే నిర్ధారణ అవుతుంది. ఇది గతంలో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉండేది. ప్రస్తుతం జగిత్యాలలోని డయాగ్నొస్టిక్ సెంటర్‌లో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన వారికే ఈ పరీక్షలు చేస్తారు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కడా ఇలాంటి కేంద్రాలే లేవు. అయినప్పటికీ ప్రైవేట్ ఆస్పత్రులు ఏవో టెస్ట్‌లు చేస్తూ.. ప్లేట్‌లెట్స్ తగ్గాయని చెబుతూ.. డెంగీగా నిర్ధారిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి ఆస్పత్రి ల్యాబ్‌లో పాథలాజిస్ట్, మెడికల్ టెక్నీషియన్స్ ఉండాలి. కానీ ఏ ఆస్పత్రిలోనూ కన్పించడం లేదు.

**ఆస్పత్రులు కిటకిట**

వాతావరణ మార్పులతో ప్రజలు జ్వరాలబారిన పడి ప్రైవేటు ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా టైఫాయిడ్, మలేరియాతో బాధపడుతున్నవారే అధికంగా ఉన్నారు. ప్రతి ఒక్కరూ ఇక్కడే పరీక్షలు చేసుకోవాలంటూ.. ల్యాబ్‌లోనే చేస్తూ వ్యాధిని నిర్ధారిస్తున్నారు.

**బోర్డులెక్కడా..?**

- నిబంధనల ప్రకారం ప్రతి ఆస్పత్రిలో ఫీజులు, ల్యాబ్ రేట్లు తప్పకుండా ప్రదర్శించాలి. కానీ అవి ఎక్కడా కన్పించవు. సీజనల్ వ్యాధులు అత్యధికంగా రావడంతో వారికి వైద్యం వ్యాపారంగానే మారింది. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న కొందరు మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల వారు పల్లెల్లోని కొందరు ఆర్‌ఎంపీలను మచ్చిక చేసుకుని వారికి కమీషన్లు ఇస్తూ తమ ఆస్పత్రికే తీసుకురావాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. వారికి కమీషన్లతోపాటు, ఫారిన్ టూర్లకు పంపిస్తున్నారు. దీంతో కొందరు వారికి మచ్చిక ఉన్న ఆస్పత్రులకు తీసుకువచ్చి చికిత్స చేయిస్తున్నారు.

**ఎలిసా టెస్ట్ ద్వారానే నిర్ధారణ**



ప్లేట్‌లెట్స్ 30 వేల లోపు పడిపోయి.. తీవ్రమైన జ్వరం ఉంటేనే డెంగీగా పరిగణించాలి. అది కూడా ఎలిసా టెస్ట్ ద్వారానే నిర్ధారణ చేయాలి. అది జిల్లాలో కేవలం టీ హబ్‌లోనే ఉంది. ఎన్‌ఎస్‌-1 టెస్ట్ ద్వారా నిర్ధారణ కాదు. ఆ టెస్ట్‌ల ద్వారా ప్రతిదీ పాజిటివ్‌గానే వస్తుంది. ప్రజలు భయాందోళనకు గురికావద్దు. – శ్రీధర్, డీఎంహెచ్‌వో

---

# వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రత

- నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, గజ ఈతగాళ్ల ఏర్పాటు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: జిల్లాలో వినాయక నవరాత్రులు ముగుస్తుండటంతో నిమజ్జనానికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లావ్యాప్తంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.



**సాక్షి:** జిల్లాలో నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ఎలాంటి చర్యలు చేపట్టారు?

**ఎస్పీ:** జిల్లాలో రెండురోజుల పాటు జరిగే వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం.

**సాక్షి:** నిమజ్జనంపై నిర్వాహకులకు ఎలాంటి సూచనలు చేశారు?

**ఎస్పీ:** ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను అంతే శ్రద్ధతో నిమజ్జనం చేయాలి. నిమజ్జనం పూర్తయ్యే వరకు విగ్రహాల బాధ్యత నిర్వాహకులదేనని సూచనలు జారీ చేశాం.

**సాక్షి:** నిమజ్జనం ప్రాంతంలో ఎలాంటి చర్యలు చేపట్టారు?

**ఎస్పీ:** నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో క్రేన్ల ఏర్పాటుతో పాటు తెప్పలు, గజఈతగాళ్లను ఏర్పాటు చేశాం. ఎవరు కూడా తొందరపడి నీటిలోకి దిగకుండా, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాం.

**సాక్షి:** సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

**ఎస్పీ:** జిల్లాలో వినాయక నిమజ్జనం సందర్భంగా జగిత్యాలలోని 8, కోరుట్లలో 3, మెట్‌పల్లిలో 3 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. ఆ ప్రదేశాల్లో అదనపు బలగాలతో పర్యవేక్షణ కొనసాగుతుంది.

**సాక్షి:** నిమజ్జనానికి వెళ్లే వాహనాలకు రూట్‌మ్యాప్ ఏర్పాటు చేశారా?

**ఎస్పీ:** జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో ఇప్పటికే నిమజ్జనానికి తీసుకెళ్లే రహదారుల రూట్ మ్యాప్‌లను తయారుచేశాం. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం.

**సాక్షి:** జిల్లాలో ఎంత మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తారు?

**ఎస్పీ:** రెండు రోజుల పాటు జరిగే వినాయక నిమజ్జనానికి సుమారు 600 మంది పోలీసులతో బందోబస్తును పటిష్ఠంగా ఏర్పాటు చేస్తున్నాం.

**సాక్షి:** విగ్రహాలను తరలించే వాహనాదారులకు మీరిచ్చే సూచనలు?

**ఎస్పీ:** వినాయకులను తరలించే వాహనాలు నడిపే వ్యక్తికి లైసెన్స్ ఉండటంతో పాటు వాహనం ఫిట్‌నెస్ ఉండేలా చూసుకోవాలి. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనదారులు క్రమపద్ధతిలో వెళ్లాలి. ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేయకూడదు. ఇతరులను ఇబ్బందులు పరిచేలా ఫ్లెక్సీలు కట్టినా కఠిన చర్యలు తీసుకుంటాం.

**సాక్షి:** జిల్లాలో ఎన్ని రోజుల పాటు నిమజ్జనం కొనసాగుతుంది?

**ఎస్పీ:** జిల్లాలో రెండు రోజుల పాటు వినాయక నిమజ్జనం ఉంటుంది. జగిత్యాలలో 27, 28, మెట్‌పల్లిలో 27, కోరుట్లలో 28, ధర్మపురిలో 28 తేదీల్లో వినాయక నిమజ్జనం జరుగుతుంది.

**సాక్షి:** గోదావరి వద్ద నిమజ్జన ప్రాంతంలో ఎలాంటి చర్యలు చేపట్టారు?

**ఎస్పీ:** ధర్మపురి గోదావరి, రాయపట్నం వద్ద ఎల్లంపల్లి బ్యాంక్ వాటర్ ఉధృతి ఎక్కువగా ఉండటంతో నిమజ్జనానికి ప్రత్యేక క్రేన్లు ఏర్పాటు చేయించాం. రాయపట్నం వద్ద మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాల వినాయకులు కూడా నిమజ్జనానికి వస్తున్న నేపథ్యంలో అదనపు బందోబస్తు ఏర్పాటు చేశాం.

**సాక్షి:** ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

**ఎస్పీ:** వినాయక విగ్రహాలను తరలిస్తున్నప్పుడు ఎలాంటి విద్యుత్ వైర్లు తగలకుండా చర్యలు చేపడుతున్నాం. నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో నిమజ్జనానికి అనుమతించడం లేదు.

---

# పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలి

- ఎన్నికల పరిశీలకుడు సుదర్శన్‌రెడ్డి

జగిత్యాల: ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలని ఎన్నికల పరిశీలకుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాలో పర్యటించారు. ముందుగా కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబితా సవరణ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. అనంతరం పట్టణంలోని 163వ పోలింగ్ కేంద్రం, బుగ్గారంలోని చిన్నాపూర్‌లో 57వ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట కలెక్టర్ యాస్మిన్‌బాషా, అదనపు కలెక్టర్లు దివాకర, లత, ఆర్డీవో నర్సింహమూర్తి, తహసీల్దార్లు నరేశ్, మాజీద్ తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

**ఓటరు జాబితా పరిశీలన**

ధర్మపురి: ఓటరు జాబిత సవరణ పకడ్బందీగా నిర్వహించాలని ఎలక్షన్ అబ్జర్వర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆకసాయిపల్లెలో 45వ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపునకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహమూర్తి, తహసీల్దార్ కృష్ణ చైతన్య తదితరులున్నారు.

# ఆరోగ్య మహిళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్(కోరుట్ల): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి 'ఆరోగ్య మహిళ' కార్యక్రమం అమలును పర్యవేక్షించారు. ఆరోగ్య మహిళా కేంద్రాల్లో ప్రతీ మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు వ్యాధుల బారినపడకుండా ముందస్తుగా పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర సమస్యలు ముందుస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స అందించాలనేది 'ఆరోగ్య మహిళ' ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వాహిని, సీహెచ్‌వో రామ్మోహన్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఫార్మసిస్ట్ సైఫొద్దిన్, స్టాఫ్‌నర్స్ సుమ, ల్యాబ్ టెక్నీషియన్ ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్

---

# కాంగ్రెస్ మోసపూరిత హామీలు నమ్మొద్దు

- మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్(ధర్మపురి): అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తుందని, నమ్మొద్దని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం ఎండపల్లి మండలం సూరారం, గొడిశెలపేట గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సూరారంలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడ్డాక అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని, రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. 40 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎందుకు అభివృద్ధి చేయలేదని, ఇప్పుడు అధికారంలోకి రావడానికి అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేయాలని చూస్తుందని, ప్రజలు గమనించాలని కోరారు. ఒకప్పుడు సాగునీరు లేక వలసలు వెళ్లిన రాష్ట్రంలో ఇప్పుడు ధాన్యంరాశులు పండిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. మరోసారి ఆదరించి ఆశీర్వదిస్తే నియోజకవర్గ ప్రజలను కడుపులో పెట్టి కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న మంత్రి కొప్పుల

# తెలంగాణలో ఉద్యమకారులకు పెద్దపీట

జగిత్యాల: తెలంగాణలో ఉద్యమకారులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకని కలెక్టరేట్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమ కళాకారులకు, ఉద్యోగులకు సముచిత స్థానం లభించిందన్నారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, కొండలక్ష్మణ్ బాపూజీ, కాళోజీ, సేవాలాల్ జయంతిలను ప్రభుత్వపరంగా జరుపుతున్నామని వివరించారు. విద్య ద్వారానే సమాజంలో గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, గిరిజన సంక్షేమాధికారి జనార్దన్, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి సాయిబాబా, డీపీఆర్వో భీంకుమార్, సీనియర్ సిటిజన్ హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

### ఆశాలపై సవతి ప్రేమ

సారంగాపూర్(జగిత్యాల): ఆశాకార్యకర్తల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ సులోచన అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సమ్మెలో పాల్గొని మాట్లాడారు. ఆశాలపై ప్రభుత్వం సవతి ప్రేమ చూపుతుందన్నారు. జీతం రూ.18 వేలకు పెంచాలని, రూ.5 లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలన్నారు. బదనపల్లి ప్రేమలత, మాదాసు మంజుల, సరిత, రజిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సులోచన

కాగా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో అంగన్‌వాడీ టీచర్ల సమ్మె కొనసాగుతుంది. టీచర్లతో పాటు ఆయాలు సమ్మెలో పాల్గొన్నారు.

### నిమజ్జన ఏర్పాట్లలో అవకతవకలపై ఫిర్యాదు

జగిత్యాల: గణేశ్ నిమజ్జనం సందర్భంగా టెండర్లలో అవకతవకలు జరిగాయని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, వినాయక నిమజ్జనం సందర్భంగా చింతకుంట చెరువులో గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు తొలగించడం, గజ ఈతగాళ్లు, నాటుతెప్పలకు గాను ఇంజినీరింగ్ అధికారులు ఎస్టిమేషన్ లేకుండా, ఫీల్డ్‌మీదకు వెళ్లకుండా రూ.5 లక్షలు కేటాయించారని, కానీ అందులో తుంగ మాత్రమే ఉందన్నారు. అది సైతం శానిటేషన్ కార్మికులే తీశారని, గుర్రపు డెక్క లేదన్నారు. 48 వార్డులను నాలుగు జోన్లుగా విభజించి ఒక్కో జోన్‌కు రూ.5 లక్షలతో మొరం, చిప్స్ డస్ట్‌తో ప్రతి వార్డులో గుంతలు పూడ్చేందుకు టెండర్లు పిలిచారని, కానీ అన్ని గల్లీల్లో సీసీరోడ్లే ఉన్నాయని, మొరం పోయాల్సిన అవసరం లేదన్నారు. అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.



లండన్‌లో గణనాథున్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న హైదరాబాద్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు

### లండన్‌లో వినాయక నిమజ్జనం

రాయికల్(జగిత్యాల) : లండన్‌లోని రీడింగ్ నగరంలో హైదరాబాద్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని నిమజ్జన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. గణపతి బొప్పా మోరియా, జై బోలో గణేశ్ మహరాజ్‌కి అంటూ నినాదాలతో పాటు భజనలు ఆకట్టుకున్నాయి. గణపతి లడ్డూను జీవన్, సుమన్, గోలి, మధు, గుల్లైలు వేలంలో 15 ఫౌండ్స్‌కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దూసరి అశోక్, సభ్యులు జాహ్నవి, సతీశ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుష్మిత, శ్రీనివాస్, లక్ష్మి, సుమన్, మమత పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నృసింహుని సేవలో ఎలక్షన్ అబ్జర్వర్


ఆలయంలో సుదర్శన్‌రెడ్డి తదితరులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు సుదర్శన్‌రెడ్డి దర్శించుకున్నారు. ప్రధాన, అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రేనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, మున్సిపల్ కమిషనర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### అగ్నివీర్‌కు ఎంపిక


గగన్

మల్యాల(చొప్పదండి): మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన ఎనుగందుల రజని–మోహన్‌ల రెండో కుమారుడు గగన్ ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన అగ్నివీర్ ర్యాలీలో పాల్గొని ఎంపికయ్యాడు. గగన్ పెద్దపూర్ గురుకుల పాఠశాలలో 5 నుంచి పదో తరగతి, గురుకుల కళాశాలలో ఇంటర్ పూర్తిచేసి, ప్రస్తుతం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచే దేశ సేవ చేయాలనే సంకల్పంతో పదో తరగతి నుంచే నిత్యం గ్రౌండ్‌కు వెళ్తూ ప్రాక్టీస్ చేశాడు. తన కలను సాకారం చేసుకున్న గగన్ యువతకుగా స్ఫూర్తిగా నిలిచాడు.

### బీసీ మహిళను ఎమ్మెల్యేగా గెలిపించాలి

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఈ సారి బీసీ మహిళను గెలిపించాలని తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ ప్రిసీడియం చైర్మన్ పుంజాల వినయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పార్టీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అన్ని రాజకీయ పార్టీలు బీసీలను అంటరానివారిగా రాజకీయాలకు దూరంగా పెడుతున్నారని ఆరోపించారు. రాజ్యాధికారమే లక్ష్యంగా బడుగు, బలహీన వర్గాలు, దళితులు ఏకమై బహుజన రాజ్యాన్ని నిర్మించుకోవాలనే లక్ష్యంతోనే తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా బహుజన గళం గాయకుడు లింగంపెల్లి నరేశ్ ఆటా, పాట ఆకట్టుకున్నాయి. రాష్ట్ర కన్వీనర్ పాండు యాదవ్, రేగొండ దయానంద్, దోచెపల్లి నరహరి, గుట్ట గంగాధర్, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### చేప పిల్లలు చిన్నగా ఉన్నాయని..

మల్యాల(చొప్పదండి): చేప పిల్లలు చిన్నవిగా ఉన్నాయంటూ వివిధ గ్రామాలకు చెందిన మత్స్యకారులు వెనుదిరిగారు. మంగళవారం మండల కేంద్రంలో చేప పిల్లలు పంపిణీ చేసేందుకు తీసుకురాగా, అవి చిన్నగా ఉన్నాయని, గతేడాదిసైతం ఇదే వరుస కొనసాగిందని వెనుదిరిపోయారు. కాగా మండలంలోని గొల్లపల్లి, రాంపూర్, నూకపల్లి, తాటిపల్లి గ్రామాలకు 56వేల చేప పిల్లలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశం, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, గంగపుత్రులు పాల్గొన్నారు.

### అండగా ఉంటాం

ధర్మపురి: సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు మంగళవారం మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలు, ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. నిరవధిక సమ్మె చేపడుతున్న వారిని మంత్రి హోదాలో ఉన్న కొప్పుల ఈశ్వర్ ఒక్కసారైనా పలకరించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, వేముల రాజేశ్, అప్పం శ్రావణ్, అశెట్టి శ్రీనివాస్, చిలుముల లక్ష్మణ్ తదితరులున్నారు.

# 'మొక్కజొన్న'పై వానరాల దాడి

- పంటను ధ్వంసం చేస్తున్న వైనం
- చేల వద్ద రోజంతా రైతు కుటుంబాల కాపలా
- సోలార్ కంచెలు, చెట్లకు మైక్‌ల ఏర్పాటు


జగిత్యాలలో చేను వద్ద కాపలాగా కుక్కలు


రాయికల్‌లో రాళ్లు విసురుతున్న రైతు

జగిత్యాల అగ్రికల్చర్: రైతులు రాత్రింబవళ్లు కష్టపడి, పంట పండించడం ఒక ఎత్తయితే దాన్ని కోతుల బారినుంచి కాపాడటం మరో ఎత్తుగా మారింది పరిస్థితి. ప్రస్తుతం మొక్కజొన్న పంట గింజ దశకు చేరుకుంది. కానీ పంటపై కోతులు దాడి చేస్తుండటంతో రైతులు తమ కుటుంబసభ్యులతో కలిసి రోజంతా చేల వద్దే కాపలా ఉంటున్నారు. గుంపులుగా వస్తున్న వానరాలు నిమిషాల్లో పంటను సర్వనాశనం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రైతులు కొంతమంది చేల వద్ద సోలార్ కంచెలు, మైక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మరికొందరు కుక్కలను కట్టేస్తున్నారు. ఇవేవీ లేనివారు చుట్టూ వలలు పెడుతున్నారు.

**జగిత్యాల జిల్లాలో 50 వేలకు పైగా ఎకరాల్లో..**

జగిత్యాల జిల్లాలో రైతులు 50 వేలకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో దాదాపు మరో 50 వేల ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. పంట గింజ దశలో ఓ వైపు రామచిలుకలు, మరోవైపు అడవి పందులు, కోతుల దాడితో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. జగిత్యాల జిల్లా ఎక్కువగా గుట్టలున్న ప్రాంతం కావడంతో మొక్కజొన్న పంట వేయాలంటేనే భయపడుతున్నారు. వానరాలు చేనులోకి వచ్చి ఒకటో, రెండో కంకులు తింటే పర్లేదు.. కానీ, గుంపులుగా పంటపై దాడి చేసి, కంకులను విరిచేస్తున్నాయి. నిత్యం కాపలా ఉంటున్న పలువురు రైతులపై దాడి చేసి, గాయపర్చాయి. మొక్కజొన్న పంటను కోతుల బారి నుంచి కాపాడునేందుకు ప్రభుత్వం, శాస్త్రవేత్తలు ఆలోచన చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

**కాపలా ఉంటున్నం**

నేను ఎకరం భూమిలో మొక్కజొన్న వేసిన. ఇప్పటికే నెల రోజులుగా కోతులు రాకుండా నా భార్య, నేను పంటకు చెరోవైపు కాపాలా ఉంటున్నం. మరో నెల రోజులు ఈ బాధ తప్పదు.



– ఏనుగు గంగారెడ్డి, రైతు, లక్ష్మీపూర్

**కంచె ఉన్నా వస్తున్నయ్**

కోతులతో మొక్కజొన్న పంట ధ్వంసమైంది. రోజంతా కాపాలా ఉండాల్సిన పరిస్థితి. కంచె ఏర్పాటు చేసినా వస్తున్నాయి. పంట చేతికి వచ్చే వరకు చేను వద్ద ఉండాల్సిందే.



– నల్ల కమలాకర్, రైతు, లక్ష్మీపూర్

## ఐలమ్మ స్ఫూర్తితో ముందడుగు వేయాలి

- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

మల్లాపూర్(కోరుట్ల): పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందడుగు వేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని చిట్టాపూర్‌లో నిర్వహించిన చాకలి ఐలమ్మ 128వ జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం చిట్టాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజనఆదిరెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. క్యాతం జీవన్ రెడ్డి, ఎల్కా కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ సభకు లక్ష జనసమీకరణ

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, నాయకులు

నిజామాబాద్: జిల్లా కేంద్రంలో అక్టోబర్ 3న జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభను జయప్రదం చేసేలా ప్రతి కార్యకర్త పని చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని బస్వాగార్డెన్‌లో ఉమ్మడి నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్ జిల్లాల పదాధికారుల సమావేశం నిర్వహించారు. సభకు జన సమీకరణ, వివిధ అంశాలపై రాష్ట్ర, జిల్లాల నాయకులతో సమీక్షించారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకులకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, 3న నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ప్రధాని మోదీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభ నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారని పేర్కొన్నారు. సభకు జిల్లాల నుంచి లక్ష మందికిపైగా ప్రజలను సమీకరించాలని సూచించారు. అధికారిక కార్యక్రమం అయినప్పటికీ బహిరంగ సభతో ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార సభకు శ్రీకారం చుడతారని తెలిపారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీజేపీ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ ధర్మపురి, మాజీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, అరుణ తార, ఆయా నియోజకవర్గ నాయకులు ధన్‌పాల్ సూర్యనారాయణ, డాక్టర్ వెంకట్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### గ్రూప్–1 రద్దుపై బీఎస్పీ నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు

జగిత్యాలటౌన్: నిరుద్యోగులు, యువత ఆగ్రహానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం కనుమరుగు కాక తప్పదని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల లింబాద్రి హెచ్చరించారు. గ్రూప్‌–1 రద్దును నిరసిస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. నిరసనలో మద్దెల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చొప్పదండి బీఆర్‌ఎస్ టికెట్ వేరేవారికి ఇవ్వాలి


టెంకాయలు కొడుతున్న నాయకులు

కొండగట్టు(చొప్పదండి): చొప్పదండి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని, వేరేవారికి అవకాశం ఇవ్వాలని కొడిమ్యాల, రామడుగు, గంగాధర మండలాల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామికి 116 కొబ్బరి కాయలు కొట్టి నిరసన తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే గ్రాఫ్ సరిగ్గా లేదని, అతడికి బీ ఫామ్ ఇస్తే పార్టీ ఓడిపోతుందని, మరోకరికి కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. కార్యక్రమంలో గోనపల్లి శ్రీనివాస్‌గౌడ్, పోచమల్లు, శివ, రాజేందర్, ప్రభాకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

### అన్నివిధాలుగా పట్టణ అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: కోరుట్ల పట్టణాన్ని 15 ఏళ్లుగా అన్ని విధాలుగా అభివృద్ధి పరిచామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణంలో జరిగిన అభివృద్ధి కళ్లమందే ఉందని పేర్కొన్నారు. కోరుట్ల అభివృద్ధిలో తనకు ఎల్లవేళలా సహకరించిన కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు పట్టణంలో నిర్వహించే పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

### ఆటో దొంగల సీసీ ఫుటేజీ విడుదల


పోలీసులు విడుదల చేసిన దొంగల సీసీ ఫుటేజీ

మల్యాల(చొప్పదండి): జగిత్యాల పట్టణం నుంచి కొండగట్టుకు ఆటో కిరాయి మాట్లాడుకుని, మల్యాల శివారులో డ్రైవర్‌ను కొట్టి, ఆటో ఎత్తుకెళ్లిన దొంగల సీసీ ఫుటేజీ లను పోలీసులు విడుదల చేశారు. ఆచూకీ తెలిపిన వారికి బహుమతి అందజేస్తామని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ బిల్లా కోటేశ్వర్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు మల్యాల సీఐ 87126 56818, ఎస్సై 87126 56830 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం తెలుపాలని పేర్కొన్నారు.

### దాడి చేసిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని అర్పపల్లి గ్రామంలో దాడి ఘటనలో వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. అర్పపల్లికి చెందిన నర్సింహారెడ్డిపై అదే గ్రామానికి చెందిన పూర్ణచందర్‌రెడ్డి పాత గొడవలు మనసులో పెట్టుకుని, అసభ్య పదజాలంతో దూషిస్తూ కట్టెతో దాడి చేశాడు. దాడిలో నర్సింహారెడ్డికి గాయాలైనాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పూర్ణచందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### యువకుడి బలవన్మరణం

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని సాయిరాం కాలనీకి చెందిన చిలుక మనోజ్ (45) గోధూర్ రోడ్డులో గల వ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మనోజ్‌కు తన భార్యతో మనస్పర్థలు ఏర్పడడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలోనే మానసికంగా కుంగిపోయిన అతడు మంగళవారం బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

జగిత్యాలరూరల్: పౌష్టికాహారం తీసుకుంటేనే గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. మంగళవారం పొరండ్ల, కల్లెడ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేసి మాట్లాడారు. అంగన్‌వాడీలు సమ్మెలో ఉన్నా జాప్యం జరగకుండా పౌష్టికాహారం పంపిణీ చేయడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జానకి, లావణ్య పాల్గొన్నారు.

### ఐదు గ్రామాల్లో వినాయక నిమజ్జనం

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం మోతె, తిప్పన్నపేట, జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి, గుల్లపేట, చల్‌గల్ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథులను భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయా గ్రామాల్లోని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు.

### కోదండరామాలయ లడ్డూ వేలం

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణం ధరూర్ క్యాంపు కోదండరామాలయంలో నెలకొల్పిన లంబోదరుడి లడ్డూకు మంగళవారం సాయంత్రం వేలం నిర్వహించారు. గండ్ర సతీశ్‌రావు దంపతులు రూ.91,116లకు లడ్డూను దక్కించుకున్నారు.

### సెల్ఫీ విత్ గణేశ్



జగిత్యాలటౌన్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపయ్య ఘనమైన పూజలు అందుకుంటున్నారు. పర్యావరణ పరిరక్షణకు 'సాక్షి' ఆధ్వర్యంలో 'సెల్ఫీ విత్ గణేశ్' నిర్వహించగా జగిత్యాలకు చెందిన పేరాల రాజు కుటుంబం మట్టి గణపతి వద్ద సెల్ఫీ దిగి పంపించారు.

## అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

- ఎస్పీ భాస్కర్


అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ భాస్కర్

మెట్‌పల్లి(కోరుట్ల): వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ భాస్కర్ పేర్కొన్నారు. పట్టణంలోని వట్టివాగు వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల గురించి అధికారులు వివరించగా, ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధు, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తదితరులున్నారు.

**మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ**

జగిత్యాలక్రైం: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కేబుల్ బ్రిడ్జిపై అక్టోబర్ 8న ఉదయం 6 గంటలకు నిర్వహించే మారథాన్ పోస్టర్‌ను ఎస్పీ ఎగ్గడి భాస్కర్ మంగళవారం ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలోని యువతీ, యువకులు కరీంనగర్‌లో నిర్వహించే రన్నింగ్ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్, మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆర్గనైజర్ డాక్టర్ కిరణ్, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్బీ సీఐ నాగేశ్వర్ రావు, ఆర్ఐ జాని పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ


బాలికల ఖోఖో జట్టుతో పీఈటీలు, ఉపాధ్యాయులు

కథలాపూర్(వేములవాడ): ఎస్జీఎఫ్ అండర్–14 విభాగంలో జిల్లాస్థాయి ఖో ఖో పోటీల్లో కథలాపూర్ మండల బాలికల జట్టు ద్వితీయ స్థానం దక్కించుకున్నట్లు పీఈటీలు రవీందర్, వినోద్ మంగళవారం తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో మండల ఖో ఖో జట్టును తయారు చేశామని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో సత్తాచాటడం గర్వకారణమని సంతోషం వ్యక్తం చేశారు.

## జోనల్‌స్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో కబడ్డీ అండర్– 14 బాలుర విభాగంలో జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థి రేవంత్ ప్రతిభ కనబర్చి జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ నాగసుధారాణి, పీడీ వినీత్‌కుమార్ అభినందించారు.

## మంత్రి కొప్పుల దిష్టిబొమ్మ దహనం


మంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ధర్మపురి: ఎస్సీల వర్గీకరణ వ్యతిరేక శక్తులను ప్రోత్సహించేలా పోస్టర్ ఆవిష్కరించిన సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ దిష్టిబొమ్మను ఎమ్మార్పీఎస్ నాయకులు దహనం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం మంత్రి వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం మాట్లాడుతూ, ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు తీసుకున్న కొప్పుల ఈశ్వర్ వర్గీకరణకు వ్యతిరేకంగా గోడ పత్రికలను విడుదల చేయడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని, మాదిగ సామాజిక వర్గానికి మంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీల వర్గీకరణకు మూడు దశాబ్దాల నుంచి పోరాటం చేస్తున్నామని, మాల సామాజిక వర్గానికి మంత్రి కొమ్ముకాస్తూ మద్దతు తెలుపడం ఎంత వరకు సమంజసమని మండిపడ్డారు. భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అన్ని వర్గాలకు సమ న్యాయం చేయాల్సిన మంత్రి ఒక వర్గానికి కొమ్ము కాయడం ఏమిటని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో మాదిగలను ఓట్లు అడిగే హక్కు మంత్రి ఈశ్వర్‌కు లేదని, ఒకవేళ అడగాలనుకుంటే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అరికెల్ల సతీశ్, ముల్కల శ్రీనివాస్, దూడ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

### జీపీ కార్మికుడి ఆత్మహత్య


నల్లపోశయ్య(ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన జీపీ కార్మికుడు చిట్యాల నల్లపోశయ్య (55) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. గత 8 నెలలుగా పంచాయతీ కార్మికుడికి సంబంధించిన జీతం డబ్బులు రాక, కుటుంబాన్ని పోషించలేక మనస్తాపం చెంది మద్యానికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంటి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య చిట్యాల పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ఆత్మహత్య చేసుకున్న పోశయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు జంగిలి ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం హామీ ఇచ్చిన బీమా రూ.5 లక్షలు వెంటనే చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ఈసందర్భంగా దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయాన్ని సీఐటీయూ మండల శాఖ తరుపున గ్రామపంచాయతీ పాలకవర్గానికి అందజేశారు.

## ఉన్నత చదువులకు వెళ్లి అనంత లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి


పవన్ (ఫైల్)

ధర్మపురి: ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సంపాదిస్తానని వెళ్లిన విద్యార్థి రోడ్డు ప్రమాదానికి గురై అనంతలోకాలకు వెళ్లాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్తుల వివరాలు.. ధర్మపురి మండలం బూరుగుపల్లెకు చెందిన బుర్ర లక్ష్మి, శంకరయ్య దంపతులకు కొడుకు పవన్(21), కూతురు సంతానం. పవన్ హైదరాబాద్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సోమవారం కళాశాల నుంచి రూంకు వెళ్తున్న సమయంలో టిప్పర్ ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పదిరోజుల క్రితం ఇంటి నుంచి హైదరాబాద్ వెళ్లిన పవన్ మృత్యువాత పడటం కుటుంబాన్ని కలచివేసింది. ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలో ఓ కంపెనీలో ఉద్యోగానికి సెలెక్ట్ అయ్యాడు.

**గల్ఫ్ నుంచి వచ్చిన తండ్రి**

కొడుకు మరణవార్త విన్న తండ్రి శంకరయ్య గల్ఫ్ నుంచి మంగళవారం గ్రామానికి చేరుకున్నాడు. శంకరయ్య గ్రామంలో ఏసీ మెకానిక్‌గా చేసి అదే పనిమీద ఏడాది క్రితం కువైట్ వెళ్లాడు. కొడుకు కడసారి చూపు కోసం తిరిగివచ్చాడు. కొడుకు అకాల మరణంతో ఆ ఇంట్లో చీకట్లు అలుముకున్నాయి.

### 'అధికార దుర్వినియోగం'

కోరుట్ల: నియోజకవర్గంలో లబ్ధిదారులకు పింఛన్ కార్డుల పంపిణీ పేరుతో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆరోపించారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పింఛన్ లబ్ధిదారులు మూడునాలుగు గ్రామాల వారిని ఒక్కచోట చేర్చి కార్డుల పంపిణీ పేరుతో ప్రచారం నిర్వహిస్తునారని పేర్కొన్నారు. తన కుమారున్ని గెలిపించేందుకు విద్యాసాగర్‌రావు తంటాలు పడుతున్నారన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, నర్సయ్య, భాస్కర్ తదితరులున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
CHANGE OF NAME

I, VALLAPUREDDY RAJAVVA D/o NARAYANA REDDY, Inter BSNL Telecom Technician, shallhenceforth be known as KONDAM RADHA W/o Late KONDAM MAHENDER REDDY. VALLAPUREDDY RAJAVVA. [K-1217200]

WANTED

రామకృష్ణ గ్రూపు, VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధుల సేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15 to 22 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 8639756219, 8639756226 [B-1068118]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640468899/ 9640258899 [H-189336]

కరీంనగర్, గోదావరిఖని, మంచిర్యాలలో ఫ్లిప్‌కార్ట్ & అమేజాన్ లార్జ్ డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ & టాటా ఏస్ గూడ్స్ వెహికిల్స్ లీజుకు కావలెను. సంప్ర: 82478 15620, 83330 08022, 90529 22226 [K-1185595]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824